సాక్షి నిజామాబాద్

సోమవారం ၊ 6 ၊ జనవరి ၊ 2025



పసుపు తవ్వకాలకు..

పసుపు తవ్వకాలు ప్రారంభమయ్యాయి. పసుపు తవ్వకాల కోసం మహారాష్ట్ర నుంచి కూలీలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు.

- 10లో ▸



సమస్యలు పరిష్కరించే..

తమ సమస్యలను పరిష్కరించే వరకు తగ్గేదే లేదని సమగ్ర శిక్ష ఉద్యోగులు అంటున్నారు. సమ్మె 30వ రోజూ కొనసాగింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.5 /11.4

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలున్నాయి. మంచు దట్టంగా కురుస్తుంది.

న్యూస్‌రీల్

రైతు శ్రేయస్సే కాంగ్రెస్ లక్ష్యం



నవీపేట: రైతు శ్రేయస్సుకు కాంగ్రెస్ ప్రాధాన్యత ఇస్తుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మండలంలోని నాళేశ్వర్, లింగాపూర్ గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన ఎరువుల గోదాములను సుదర్శన్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగాదాయన మాట్లాడుతూ.. సాంకేతిక కారణాలతో కొందరు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వర్తించలేదన్నారు. లోపాలను సవరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారని, త్వరలో అందరికీ రుణమాఫీ వస్తుందని హామీ ఇచ్చారు. నాళేశ్వర్ గ్రామ శివారులోని పురాతన రాజరాజేశ్వరాలయ అభివృద్ధికి కృషి చేస్తానని, పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి రూ.7 లక్షలు మంజూరు చేస్తానన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాంచందర్, బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు, నాయకులు శ్రీనివాస్ గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, మాణిక్యేశ్వర్‌రావు, బాల్‌రాజ్‌గౌడ్, బాబర్, విజయ్, నర్సింగ్‌రావ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో గుంజీళ్ల మాస్టార్



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగరాజ్‌లోని నార్త్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్‌లో ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు నిర్వహిస్తున్న గ్లోబల్ ఆయుష్ మహాకుంభ్ అంతర్జాతీయ సదస్సులో జిల్లాకు చెందిన అందె జీవన్‌రావు పాల్గొన్నారు. సంజీవిని వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సులో గుంజీళ్ల మాస్టారుగా ప్రసిద్ధిగాంచిన జీవన్‌రావు పాల్గొని 'కృత్రిమ మేధతో కూడిన సూపర్ బ్రెయిన్ యోగా- మెరుగైన జ్ఞాపకశక్తి, సమాజ క్షేమం' అంశంపై తన పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. పరిశోధనా వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కృత్రిమ మేధను సూపర్ బ్రెయిన్ యోగాతో అనుసంధానించడం ద్వారా అద్భుతమైన ఫలితాలను సాధించొచ్చని ఆయన వివరించారు. అనంతరం ప్రయాగ్‌రాజ్ సంజీవని వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు జీవన్‌రావును ఘనంగా సన్మానించారు.

నేడు బీఆర్‌ఎస్ నిరసనలు

నిజామాబాద్ అర్బన్: రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేయడాన్ని ఎండగడుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా సోమవారం పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని చెప్పుకుంటూ ఎన్నికల హామీలను అమలు చేయకుండా కపటనీతిని ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని పేర్కొన్నారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తామని, కాంగ్రెస్ చేతిలో మోసపోయిన రైతాంగానికి సంఘీభావంగా జరగనున్న నిరసన కార్యక్రమాలలో రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చైనా మాంజా పట్టివేత



ఖలీల్‌వాడి: నగరంతోపాటు ఆర్మూర్ పట్టణంలోని గాలిపటాల దుకాణాలపై ఆదివారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు దాడులు నిర్వహించి, నిషేధిత చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని పెద్దబజార్‌లోగల పతంగుల దుకాణాలను పోలీసులు తనిఖీ చేయగా ఒక షాపులో నాలుగు బెండల్స్ చైనా మాంజాను పట్టుకోగా దాని విలువ రూ.4వేలు ఉన్నట్లు రెండో టౌన్ ఎస్సై యాసీన్ ఆరాఫత్ తెలిపారు. మరో షాపులో 5 బెండల్స్ దొరుకగా రూ.5వేలు విలువ ఉన్నట్లు తెలిపారు. సంబంధిత షాపు యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే ఆర్మూర్‌లోని ఓ దుకాణంలో తనిఖీలు చేసి ఆరు బెండళ్ల చైనా మాంజాను పట్టుకున్నామని, దాని విలువ సుమారు రూ.6వేలు వరకు ఉంటుందని టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌కు అప్పగించినట్లు తెలిపారు.

దొంగకు దారులెన్నో..

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- నమ్మితే నట్టేట ముంచుతారు
- ఏటేటా పెరుగుతున్న బాధితుల సంఖ్య
- అప్రమత్తత అవసరమంటున్న పోలీసులు

క్షణాల్లో డబ్బు కొల్లగొట్టే సైబర్ దొంగలు ఏ దారి(ప్లాన్)లో వస్తారో.. ఏ విధంగా నమ్మిస్తారో తెలియని పరిస్థితి. టెక్నాలజీని ఉపయోగించుకుంటున్న కేటుగాళ్లు అమాయకులను టార్గెట్ చేస్తున్నారు. బ్యాంకులు, ఆఫర్లు, లోన్‌లు, బిజినెస్ ఫ్రాంచైజీల పేరుతో నిలువునా దోచుకుంటున్నారు. తాము పోలీసులమంటూ అమాయకులకు ఫోన్‌లు చేసి బెదిరింపులకు పాల్పడుతుండడంతో ఎంతో మంది మోసపోయిన ఘటనలున్నాయి.



సంవత్సరం	2022	2023	2024
కేసులు	192	294	376

ఖలీల్‌వాడి: జిల్లాలో సైబర్ మోసాలకు గురవుతున్న బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. రోజుకో కొత్త తరహాలో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు. అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం చేయాలని ఒకరు.. మీ ఏటీఎం లాక్ అయ్యిందని మరొకరు.. ఆఫర్‌ల పేరిట కొందరు.. డిజిటల్ అరెస్టులంటూ బెంబేలెత్తించే మరికొందరు ఇలా సైబర్ నేరగాళ్లు తమకు తోచిన విధానంలో అమాయకులను టార్గెట్ చేస్తున్నారు. గుడ్డిగా నమ్మిన ప్రజలను నట్టేట ముంచుతూ, డబ్బును దోచేస్తున్నారు. కాల్స్, మెసేజ్‌లు, వాట్సాప్ లింక్‌లు, యాప్‌ల ద్వారా నమ్మించి, మాయ చేస్తున్నారు. ప్రతి రోజూ సైబర్ మోసాలకు సంబంధించిన కేసులు నమోదవుతునే ఉన్నాయి. మోసపోయిన తరువాత బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ప్రధానంగా ఏ అంశాలపై మోసాలకు పాల్పడుతున్నారో సైబర్ పోలీసులు గుర్తించారు. దీనిపై సాక్షి ప్రత్యేక కథనం..

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో..

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేస్తున్నారు. అమాయకులను ఎక్కువగా కంబోడియా, సిరియా, ఫిలిప్పీన్స్, దక్షిణాఫ్రికా వంటి దేశాలకు పంపించి సైబర్ నేరాలు చేయిస్తున్నారు. దీంతోపాటు యువకులను అడుపెట్టుకుని ఇక్కడ ఉన్నవారిని బెదిరించి డబ్బులు తీసుకుంటున్న ఘటనలు ఉన్నాయి. మన దేశంతో పోలిస్తే ఆర్థికంగా వెనుకబడి దేశాల్లో ఉపాధి కోసం వెళ్లొద్దని సైబర్ పోలీసులు, పోలీసులు సూచిస్తున్నారు.

జిల్లాలో 862 కేసులు

జిల్లా వ్యాప్తంగా 2022 నుంచి 2024 వరకు 862 కేసులు నమోదయ్యాయి. 2024లో సైబర్ క్రైమ్‌కు సంబంధించి పోలీసులకు 376 ఫిర్యాదులు అందాయి. 2023తో పోలిస్తే 2024లో 82 కేసులు ఎక్కువగా నమోదు కాగా 27.89 శాతం సైబర్‌క్రైమ్ పెరిగినట్లు పోలీసుల గణాంకాలు చెబుతున్నాయి. కొందరు బాధితులు సరైన సమయంలో పోలీసులను ఆశ్రయించడంతో డబ్బులు సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోగలిగారు.

ఇలా ఫిర్యాదు చేయండి..

DIAL 1930 to report cyber crime

సైబర్ మోసానికి గురైన వారు వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా సైతం ఫిర్యాదు చేయొచ్చు. మోసం జరిగిన అర గంటలో ఫిర్యాదు చేస్తే డైమండ్ అవర్ లేదా గంటలో చేస్తే గోల్డెన్ అవర్‌గా చెబుతారు. ఈ సమయాల్లో ఖాతాలను ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుంది.

అప్రమత్తంగా ఉండాలి

అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌లు, వాట్సాప్ కాల్స్ వస్తే స్పందిచొద్దు. వ్యక్తిగత వివరాలు అడిగితే ఇవ్వద్దు. లింకులు పంపిస్తే క్లిక్ చేయొద్దు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి. సైబర్ మోసాలకు గురైతే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. – వెంకటేశ్వర్, సైబర్ క్రైం ఏసీపీ, నిజామాబాద్ కమిషనరేట్

మోసాలు.. జాగ్రత్తలు

- మేము ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నాం. మీ ఫోన్ నంబర్‌ను చట్టవిరుద్ధమైన కార్యకలపాలకు వాడుతున్నారు. మీ నంబర్ నిలిపివేస్తున్నామని భయపెడతారు. కానీ ట్రాయ్ నిబంధనల మేరకు సెల్ నంబర్‌ను నిలిపివేసే అవకాశం లేదు.
- మీ పేరుపై పార్సిల్ వచ్చింది. ఇందులో అక్రమంగా తీసుకొచ్చిన వస్తువులు, డ్రగ్స్ ఉన్నాయని భయపెడతారు. క్రిమినల్ కేసులు అవుతాయని, డబ్బులు ఇచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని చెబుతారు. కస్టమ్స్, ఎయిర్ ఫోర్స్, పోలీసులు, ఎక్సైజ్ వివిధ రకాల పేర్లు చెబుతారు. కానీ ప్రజలు అధికారిక వెబ్‌సైట్లు, సంబంధిత అధికారులతో మాట్లాడి, వివరాలు తెలుసుకోవాలి
- మీ కుటుంబసభ్యుడు కేసులో ఇరుక్కున్నాడు. అరెస్ట్ చేయబోతున్నామంటూ పూర్తి వివరాలు తెలుపుతూ భయపెడతారు. ఇలాంటి వాటిని నమ్మొద్దు.
- స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేస్తే భారీగా లాభాలు వస్తాయని వల వేస్తారు. కానీ సెబీ రిజిస్ట్రేషన్ ఉన్న ఏజెంట్లను మాత్రమే నమ్మాలి.
- ఇంటి వద్ద నుంచే ఉద్యోగం(వర్క్ ఫ్రం హోమ్) కల్పిస్తామని, బ్యాంకుల్లో కరెంట్ అకౌంట్ తీసుకుని డబ్బులు ట్రాన్జక్షన్ చేస్తే ఒక్కో ట్రాన్జక్షన్‌కు కొంత చెల్లిస్తానని నమ్మిస్తారు. వారి మాటలను గుడ్డిగా నమ్మి మోసపోవద్దు. నమ్మితే క్రిమినల్ కేసులు నమోదయ్యే ప్రమాదం ఉంటుంది.
- పొరపాటున మీ అకౌంట్‌లోకి డబ్బులు వేశామని అపరిచితులు ఫోన్ చేస్తే స్పందించొద్దు.
- క్రెడిట్ కార్డులు, లోన్‌ల మంజూరు పేరుతో కాల్స్ వస్తే స్పందించొద్దు.
- కేవైసీ గడువు ముగిసింది. దానిని పునరుద్ధరించుకువాలని నమ్మించి లింక్ పంపిస్తారు. అటువంటి లింక్‌లను ఓపెన్ చేయొద్దు.
- పోలీసుల పేరు చెప్పి ఎవరైనా ఫోన్ చేస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి.
- టాక్స్ అధికారులమని, మీకు పెద్ద మొత్తంలో రీఫండ్ వస్తుందని బ్యాంక్ వివరాలను కోరతారు. వాటికి స్పందించవద్దు. మీ దగ్గరలోని ఇన్‌కమ్‌టాక్స్ అధికారులను సంప్రదించాలి. లేకుంటే టాక్స్ కన్సల్టెంట్‌ను కలవాలి.

10 రోజులు 9 టీఎంసీలు!

- యాసంగి సీజన్‌కు ఎస్సారెస్పీ నీటి వినియోగం
- వేసవిలో మరింత పెరిగే అవకాశం
- రోజుకు 11,305 క్యూసెక్కుల అవుట్ ఫ్లో



ఎస్సారెస్పీ ప్రస్తుత నీటి మట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్‌కు పది రోజుల్లో 9 టీఎంసీల నీటి వినియోగం పూర్తయ్యింది. గత నెల 25 నుంచి కాలువల ద్వారా ఆయకట్టుకు నీటి విడుదలను చేపట్టారు. మొదటి రెండు రోజులు తక్కువ మొత్తంలో నీటిని విడుదల చేసినప్పటికీ.. ఆ తరువాత రోజుకు టీఎంసీ చొప్పున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 11,305 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కనీసం మరో 110 రోజులపాటు నీటిని విడుదల చేయాల్సి ఉండగా, ఈ లెక్కన 100 టీఎంసీల నీరు అవసరం ఉంటుంది. కానీ ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 71.5 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. నీటి వినియోగం ఇలాగే ఉంటే సీజన్ చివరలో పంటలకు నీరందకుండాపోయే ప్రమాదం ఉంది. దీనిని దృష్టిని దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్ట్ అధికారులు ప్రతి నీటి బొట్టు సద్వినియోగమయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3500 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 5 వేలు, సరస్వతి కాలువ ద్వారా 700, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, అలీసాగర్ లిఫ్ట్‌కు 463 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్‌కు 186, ముంపు గ్రామాల ఎత్తిపోతల పథకాలకు 312, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 425 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1088.30(71.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

జలసౌధకు వెళ్లాల్సిందేనా..?

- నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్‌లో సీఈ కార్యాలయం
- ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో కార్యకలాపాలు
- ఇబ్బందిపడుతున్న స్థానిక ఉద్యోగులు
- సార్‌తో పని ఉంటే కాంట్రాక్టర్లు అక్కడికి వెళ్లాల్సిందే..



హైదరాబాద్‌లోని జలసౌధలో నిజామాబాద్ ఇరిగేషన్ సీఈ క్యాంప్ కార్యాలయం

నిజామాబాద్‌నాగారం: ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్(సీఈ)ను కలవాలంటే ఉద్యోగులు, కాంట్రాక్టర్లు హైదరాబాద్‌లోని జలసౌధకు వెళ్లాల్సిందే. నిబంధనలకు విరుద్ధంగా అక్కడే కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్న ఉన్నతాధికారి ఇద్దరు రిటైర్డ్ ఉద్యోగులను అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించుకుని రోజువారి కార్యకలాపాలు అక్కడి నుంచే నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పదోన్నతి కోసం ప్రయత్నాలు చేస్తున్న సదరు అధికారి.. జిల్లా కేంద్రంలో సీఈ కార్యాలయం ఉన్నప్పటికీ ఇక్కడికి వచ్చేందుకు సుముఖంగా లేరని తెలుస్తోంది. దీంతో కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఏ పని ఉన్నా ఫైళ్లు పట్టుకుని హైదరాబాద్‌కు పరుగులు తీస్తున్నారు.

పర్యవేక్షణ కరువు

నిజామాబాద్ జిల్లాకు రెండేళ్ల క్రితమే సీఈ కార్యాలయం ఏర్పాటైంది. సీఈ పరిధిలో డిప్యూటీ సీఈ, నిజామాబాద్ ఎస్‌ఈ, ఆర్మూర్ ఎస్‌ఈ, డీఈలు, డిప్యూటీ డీఈలు, ఏఈలు, జేఈలు, ఇతర ఉద్యోగులు ఉంటారు. సీఈ పరిధిలోనే ఇరిగేషన్ ప్రాజెక్టులు, కార్యాలయాలున్నాయి. రబీ సీజన్ పనులు ప్రారంభమై ప్రాజెక్టుల ద్వారా నీటిని విడుదల చేస్తున్న తరుణంలో పర్యవేక్షించాల్సిన అధికారి తమనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారి పత్తా లేకపోవడంతో ఇతర అధికారులు సైతం కార్యాలయానికి చుట్టపు చూపుగా ఇలా వచ్చి అలా వెళ్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగుల నియామకం

జిల్లా కలెక్టర్ కార్యాలయంతోపాటు క్యాంప్ కార్యలయం సైతం ఇక్కడే ఉంది. అన్ని శాఖలకు బాస్ అయిన కలెక్టర్ ఇక్కడే ఉంటుండగా, ఒకే ఒక్క శాఖకు అధికారి మాత్రం నిబంధనలకు విరుద్ధంగా క్యాంపు కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసుకోవడం చర్చనీయాంశమైంది. ఆ అధికారి అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగులను నియమించుకోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

బీఆర్‌ఎస్‌ను ప్రజలు మర్చిపోయారు

- ఉనికి కోసమే అనవసర వ్యాఖ్యలు
- పసుపు బోర్డు ఎక్కడుందో ఎంపీ అర్వింద్ చెప్పాలి
- ఈ నెల 26 తరువాత కొత్త రేషన్‌కార్డులు ఇస్తాం
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ సిటీ: బీఆర్‌ఎస్‌ను ప్రజలు మర్చిపోయారని, ఆ పార్టీ నాయకులు రాజకీయ ఉనికి కోసమే అనవసర వాఖ్యలు చేస్తున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. రూరల్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల గడీల పాలనకు ప్రజలు చరమగీతం పాడి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 13 నెలలుగా ప్రజాపాలన అందిస్తూ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించారన్నారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల అప్పులు చేస్తే, తమ ప్రభుత్వం ప్రతి నెలా రూ.22 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. అయినప్పటికీ ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నామని, ఏకకాలంలో రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేశామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చామన్నారు. సాగు చేసే భూములకే 'ఇందిరమ్మ రైతు భరోసా' ఇస్తామని స్పష్టం చేశారు. సంక్రాంతి తర్వాత ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు. ఈ నెల 26 తర్వాత కొత్త రేషన్‌కార్డులు జారీచేస్తామని, ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అన్ని సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

భారతీయ జూటాపార్టీ

బీజేపీ పక్కా జూటా పార్టీగా మారిందన్నారు. కేవలం మాటలకే పరిమితమైందని విమర్శించారు. 8 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు ఎందుకు తీసుకురావడం లేదన్నారు. బండి సంజయ్, కిషన్‌రెడ్డి వంటివారు కాంగ్రెస్‌ను విమర్శించడం సరికాదన్నారు. మతం పేరుతో ఓట్లు దండుకోవడమే బీజేపీ అజెండా అని విమర్శించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, రూరల్ అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు అగ్గు భోజన్న, క్యాతం హన్మాండ్లు, పొలసాని శ్రీనివాస్, కొలాస్ మోహన్, కెతావత్ ప్రకాశ్‌నాయక్, బోర్గాం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలి

జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలని తాను డిమాండ్ చేస్తున్నానని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవితకు హఠాత్తుగా బీసీ రిజర్వేషన్లు గుర్తుకువచ్చాయని, పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఈ విషయంపై ఎందుకు మాట్లాడలేదో చెప్పాలని ప్రశ్నించారు. తాము బీసీ రిజర్వేషన్లను ఖచ్చితంగా అమలుచేసి తీరుతామన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను వెలికి తీస్తున్నామని, ఆ కేసుల్లో కల్వకుంట్ల కుటుంబం జైలుకు వెళ్లడం ఖాయమని పేర్కొన్నారు. నిజామాబాద్‌లోనే పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన మాట ఏమైందో ఎంపీ అర్వింద్ చెప్పాలన్నారు.

పెరగనున్న సహకార సొసైటీలు

- నూతన సంఘాల ఏర్పాటుకు కసరత్తు
- ఇప్పటికే సహకార శాఖకు అందిన వినతులు
- ప్రభుత్వానికి వెళ్లనున్న ప్రతిపాదనలు




డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర వ్యాప్తంగా నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. జిల్లాల నుంచి ప్రతిపాదనలు పంపాలని సహకారశాఖ అధికారులను కోరింది. దీంతో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపే పనిలో ఉన్నారు. ఇప్పటికే కొత్త సొసైటీలు కావాలని జిల్లాలో భీమ్‌గల్, సిరికొండ తదితర మండలాల నుంచి సహకార శాఖకు వినతులు అందాయి. ఎమ్మెల్యేల అనుమతితో కొత్త సహకార సంఘాల జాబితాను సిద్ధం చేసి త్వరలో ప్రభుత్వానికి నివేదించనున్నారు. జిల్లాలో మొత్తం 89 సొసైటీలు ఉండగా, 2.70 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. సొసైటీల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందించడంతోపాటు రుణాలు కూడా అందిస్తున్నారు. రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు, ఇతర కార్యక్రమాలు సైతం సొసైటీల ద్వారానే అమలవుతున్నాయి. జిల్లాలో 2013 తర్వాత కొత్తగా వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు కాలేదు. ఇటీవల రాష్ట్రంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామ పంచాయతీలు ఏర్పడినప్పటికీ సహకార సంఘాల విభజన మాత్రం జరగలేదు. ఒకే సొసైటీ రెండు మండలాల పరిధిలోకి రావడం అలాగే ఎక్కువ గ్రామాలకు ఒకే సొసైటీ ఉండడంతో సరైన సేవలందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని చాలా రోజులుగా వినతులు రావడంతో ప్రభుత్వం ఇప్పుడు చర్యలు చేపట్టింది.

విభజన చేయడమే!

కొత్త సొసైటీల ఏర్పాటు ప్రక్రియను చేపట్టిన సహకార శాఖ ఏ విధంగా ముందుకు వెళ్లాలనే దానిపై కసరత్తు చేస్తోంది. జిల్లాలో ఉన్న సంఘాలను విభజించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలా? లేదా కొత్త సభ్యులతో సంఘాలు ఏర్పాటు చేయాలా అనే కోణాల్లో ఆలోచన చేస్తున్నారు. అయితే ఉన్న వాటినే విభజన చేస్తారనే అభిప్రాయం సర్వ త్రా వ్యక్తమవుతోంది. మండలానికి కనీసం రెండు కొత్త సొసైటీలు ఉండాలనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. జిల్లాలో 89 సంఘాలుండగా, కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని సహకార శాఖకు పది దరఖాస్తులు అందాయి. గ్రామాల నుంచి ఇబ్బందులు, అభ్యంతరాలు తలెత్తకుండా ఎమ్మెల్యేలు ప రిశీలన చేయనున్నారు. ఎమ్మెల్యేలు ఫైనల్ చేసినవే కొత్త సొసైటీలుగా ఏర్పాటు కానున్నాయి. అదే విధంగా వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం వచ్చే నెల 19న ముగుస్తుంది. ఈలోపే కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త సొసైటీలు ఏర్పాటైతే తమకు సులభంగా సేవలు అందుతాయని రైతులు అంటున్నారు.

దరఖాస్తులు అందాయి



కొత్త వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటు కోసం జిల్లాలో కొన్ని మండలాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. పరిశీలన పూర్తయిన తర్వాత ఎమ్మెల్యేల ఆమోదంతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. ఎన్ని కొత్త సంఘాలు ఏర్పాటవుతాయనేది ఇప్పుడే చెప్పలేం.
– శ్రీనివాస్‌రావు, జిల్లా సహకార శాఖ అధికారి

క్లుప్తంగా

చెక్‌డ్యాంలో భారీ చేప



వేల్పూర్: వేల్పూర్ చెక్‌డ్యాంలో ఆదివారం సుమారు 15 కిలోల బరువున్న భారీ చేప ఓ జాలరికి చిక్కింది. పెద్దవాగులోని చెక్‌డ్యాంలో వేల్పూర్ గంగపుత్రులు నిత్యం చేపలు పడుతుంటారు. ఎప్పటిలాగే చేపల వేటకు వెళ్లిన బండి కిషన్ అనే జాలరికి ఆదివారం భారీ చేప చిక్కడంతో ఆనందం వ్యక్తం చేశాడు. చెక్‌డ్యాంలో ఇంత భారీ చేప లభించడం ఇదే మొదటిసారి అని అతడు పేర్కొన్నారు.

అర్చరీ పోటీల్లో దోమకొండ క్రీడాకారుడి ప్రతిభ



దోమకొండ: జాతీయ స్థాయి అర్చరీ పోటీల్లో దోమకొండకు చెందిన క్రీడాకారుడు ప్రతిభ చూపి పతకం సాధించినట్లు కోచ్ ప్రతాప్ దాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి అర్చరీ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన అనుదీప్ సిల్వర్ పతకం సా. ధించినట్లు ఆయన తెలిపారు. క్రీడాకారుడిని అర్చరీ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కామినేని అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు తిర్మల్‌గౌడ్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహరెడ్డి, తదితరులు అభినందించారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాల పంట



కామారెడ్డి అర్బన్: రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. అథ్లెటిక్స్‌లోని వివిధ విభాగాల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు లభించాయని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజిత్‌మోహన్, డి.నరేష్‌లు తెలిపారు. ఎ.నవీన్‌రెడ్డి, ఎ.సతీష్‌రెడ్డి, ఎం.చంద్రశేఖర్‌లు బంగారు పతకాలు పొందగా జి.సునీల్‌రెడ్డి, ఓ.దినేష్‌లు వెండి పతకాలు, ఎండీ.అతీకుల్లా, డి.నరేందర్, ఎ.హరీష్‌లు కాంస్య పతకాలు పొందినట్లు, ప్రతిభ చూపిన క్రీడాకారులను అసోసియేషన్ తరఫున అభినందించినట్లు వారు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు తగ్గేదేలే

- మాట ఇచ్చి పదేళ్లు అధికారంలో ఉండి పట్టించుకోని కేసీఆర్
- మాట మార్చిన సీఎం రేవంత్‌రెడ్డి
- సమ్మెను బలహీన పర్చే పనిలో అధికారులు
- అయినా వెనక్కి తగ్గమంటున్న సమగ్రశిక్ష ఉద్యోగులు
- 30 రోజులకు చేరిన సమ్మె



నిజామాబాద్‌లో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఆర్మూర్/లింగంపేట: తమ సమస్యలను పరిష్కరించే వరకు తగ్గేదేలేదని సమగ్ర శిక్ష ఉద్యోగులు అంటున్నారు. గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసినా, అధికారులు వేధింపులకు పాల్పడుతున్నా వెనక్కి తగ్గమంటూ తేల్చిచెబుతున్నారు. ఈక్రమంలో వారు 30రోజులుగా సమ్మెను నిర్వహిస్తునే ఉన్నారు. నిత్యం వినూత్న రీతిల్లో నిరసనలు తెలుపుతునే ఉన్నారు.

హామీలిచ్చి.. మాటమార్చి..

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులు అన్న పదమే ఉండదు. విద్యా శాఖలో కాంట్రాక్టుపై పని చేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తాం అంటూ గతంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మాటిచ్చాడు. కానీ పదేళ్లు అధికారంలో ఉండి పట్టించుకోలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ జీవోను సైతం అందజేస్తామని 2023లో ప్రతిపక్షనేత హోదాలో రేవంత్‌రెడ్డి మాటిచ్చాడు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా హామీ నెరవేర్చలేదని వారు పేర్కొంటున్నారు. ఇటీవల పర్మినెంట్ చేయలేమని తేల్చిచెప్పడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతుగా వారి వెంటే ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీలు గుప్పించిన ఉపాధ్యాయ సంఘాలు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గి మొఖం చాటేసారని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు. అంతటితో ఆగకుండా ఉన్నతాధికారులు కేజీబీవీల్లో ఇన్‌చార్జి ఎస్‌వోలుగా, మండల విద్యా వనరుల కేంద్రాల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించారు. అలాగే కొందరు ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘాలతో తమకు సంబంధం లేదంటూ ఇన్‌చార్జిలుగా బాధ్యతలు స్వీకరించడమే కాకుండా పలు కేజీబీవీల్లో అదనపు ఆదాయం కోసం ఎంక్వైరీలు చేయడం వివాదాస్పదంగా మారింది. సమ్మె విరమించని పక్షంలో ఉద్యోగాల నుంచి టర్మినేట్ చేస్తామంటూ అధికారుల బెదిరింపులు సైతం ప్రారంభమైనట్లు పేర్కొంటున్నారు.

మరింత ఉధృతంగా..

పాలకులు, ప్రతిక్ష నాయకులు, అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల మాటలను నమ్మి మోసపోతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు వారి బెదిరింపులకు సైతం భయపడకుండా 30 రోజులుగా నిర్వహిస్తున్న తమ సమ్మెను మరింత ఉధృతం చేస్తామంటున్నారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయలేని పరిస్థితి ఉంటే పదేళ్ల క్రితం నుంచి సుప్రీంకోర్టు పలుసార్లు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోతే రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రారంభించే వరకు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం తమకు పే స్కేల్ ఇవ్వాల్సిందేనంటూ డిమాండ్ చేస్తున్నారు. అప్పటి వరకు తగ్గేదే లే.. అంటూ సమ్మెను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

డిమాండ్లు ఇవీ..

- సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలి.
- ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని వసతులు కల్పించాలి.
- పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు(పిటిఐ)లకు తక్షణమే 12 నెలల జీతం అమలుకు జీవో విడుదల చేయాలి.
- సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి.

సుప్రీం ఆదేశాలు పాటించాలి



సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి కాంట్రాక్టు ఉద్యోగులందరికీ పేస్కేల్ ఇవ్వాలి. సమగ్రశిక్ష ఉద్యోగులకు సైతం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రాజెక్టు కాబట్టి తమకు సంబంధం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం తప్పించుకోవడం సరైంది కాదు.

– రాజు, జిల్లా అధ్యక్షుడు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం, నిజామాబాద్

రెగ్యులరైజ్ చేయాలి



మహారాష్ట్ర, పంజాబ్, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేసారు. ఈ ప్రక్రియపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేసి మమ్మల్ని సైతం విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలి.

– గంగామణి, జిల్లా అధ్యక్షురాలు, సమగ్ర శిక్ష మహిళా ఉద్యోగుల సంఘం, నిజామాబాద్

ఆందోళనలు కొనసాగిస్తాం



ప్రభుత్వ పథకాలు అమలుపర్చడంలో కీలకంగా వ్యవహరిస్తున్నాము. గత 15 సంవత్సరాలుగా వెట్టిచాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వం వెంటనే తమకు ఉద్యోగ భద్రత కల్పించి, మినిమం పే స్కేలు అమలు చేయాలి. కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేయాలి. అంతవరకు ఆందోళనలు కొనసాగిస్తాము.

– సత్యనారాయణ, సమగ్ర శిక్ష జిల్లా జేఏసీ అధ్యక్షుడు, కామారెడ్డి

మా సేవలను గుర్తించాలి



గ్రామీణ ప్రాంతాల్లో వందశాతం అక్షరాస్యత సాధించడానికి కృషి చేయడంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఇందుకోసం బడిబయట పిల్లలను బడిలో చేర్పిస్తున్నాం. ఇందుకోసం పిల్లల తల్లి దండ్రులకు అవగాహన సైతం కల్పిస్తున్నాం. మా సేవలను ప్రభుత్వం గుర్తించి వెంటనే రెగ్యులరైజ్ చేయాలి.

– దామోదర్, సమగ్ర శిక్ష జిల్లా నాయకుడు, కామారెడ్డి

విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులకు సహకారం అందిస్తున్నాము. కేజీబీవీల్లో నాణ్యమైన విద్యను బోధిస్తూ 100 శాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాము. బాలికల విద్యాభివృద్ధికి పాటుపడుతున్నాం. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన తమను ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– వాసంతి, సమగ్ర శిక్ష జేఏసీ మహిళా అధ్యక్షురాలు, కామారెడ్డి

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి



సన్మానం పొందిన మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులు

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ





మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ అర్బన్: సావిత్రిబాయి పూలేను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్సీ షబ్బీర్‌అలీ అన్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఆదివారం బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కులగణన చేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. గత ప్రభుత్వంలో బీసీలకు గుర్తింపు లేకుండ పోయిందన్నారు. సీఎం బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని, సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా ప్రకటించారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. విద్యతోనే ఏదైన సాధించవచ్చని నమ్మిన గొప్ప శక్తి సావిత్రిబాయి పూలే అని గుర్తు చేశారు. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ కులాల్లో పుట్టినందుకు మనం గర్వపడాలన్నారు. మేయర్ నీతూకిరణ్, జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, డీఈవో ఆశోక్, బీసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్‌కుమార్, గోపాలకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, శేఖర్ గౌడ్, రత్నాకర్, సుధాకర్, రవీందర్, రవికుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జాతీయస్థాయికి ఎంపికైన బాలబాలికలు

నిజామాబాద్ నాగారం: మహారాష్ట్రలో ప్రారంభమైన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. 68వ స్కూల్ గేమ్స్ జాతీయస్థాయ సాఫ్ట్‌బాల్ అండర్ 17 బాలబాలికల విభాగాల్లో పోటీలు జరుగుతుండగా రాష్ట్ర జట్టులో జిల్లా క్రీడాకారులు ఉన్నట్లు, కోచ్ మేనేజర్లుగా మర్కంటి గంగా మోహన్, సొప్పరి వినోద్, ప్రశాంత్ కుమార్, అంజలి వ్యవహరిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల విభాగంలో నిత్యశ్రీ (జెడ్పీహెచ్‌ఎస్ తొర్లికొండ), అశ్విని (జెడ్పీహెచ్‌ఎస్ ముచ్కూర్), సాత్విక, శ్రావిక (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, సుద్దపల్లి) ఎంపికయ్యారు. అలాగే బాలుర విభాగంలో నిఖిల్ చంద్ర (నారాయణ హైస్కూల్ ఆర్మూర్), సిద్దార్థ (సత్యశోధక్ పాఠశాల సిరికొండ), లక్ష్యేందర్ కుమార్ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బోధన్), ప్రణయ్ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ ఉప్పల్‌వాయి) ఉన్నారు.

'సంక్రాంతికి వస్తున్నాం' ట్రైలర్ లాంచ్ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

నిజామాబాద్ రూరల్: నగరంలోని కలెక్టర్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమ ఏర్పాట్లను ఆదివారం ఎస్వీసీ మేనేజర్ నాగేశ్వర్ రావు, నరాల సుధాకర్, సంతోష్, కొయ్యాడ శంకర్ పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సోమవారం సాయంత్రం గ్రాండ్‌గా సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేయనున్నట్లు తెలిపారు. భారీగా నిర్వహించే ఈ ఈవెంట్‌కి 'సంక్రాంతికి వస్తున్నాం' టీం అంతా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సినిమా జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది.

సైబర్ మోసానికి యువకుడి బలి



ఆత్మహత్య చేసుకున్న కమ్మరి గంగరాజు

లింగంపేట: సైబర్ మోసగాళ్ల ఉచ్చులో చిక్కి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయిలాపూర్ గ్రామానికి చెందిన కమ్మరి గంగరాజు(28) కుటుంబం కొంత కాలంగా లింగంపేటలో నివాసం ఉంటోంది. తండ్రితో కలిసి మండలకేంద్రంలో వడ్రంగి వృత్తి చేసుకుంటున్నాడు. ఆయనకు ఇటీవల ఓ ఫోన్ కాల్ వచ్చింది. బెంగళూరు నుంచి మాట్లాడుతున్నామని, ఇంటి నిర్మాణం కోసం లోన్ ఇస్తామని, ప్రాసెసింగ్‌కు కొంత మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని అవతలి వ్యక్తి నమ్మించాడు. దీంతో గంగరాజు విడతల వారీగా రూ. 52,500 వరకు ఆన్‌లైన్‌లో పంపించాడు. ఎంతకీ రుణం మంజూరు కాకపోవడంతో తాను ఆన్‌లైన్‌లో డబ్బులు పంపిన వ్యక్తిని ఫోన్‌లో సంప్రదించగా తనకేం తెలియదని బుకాయించాడు. దీంతో మోసపోయానని గుర్తించిన గంగరాజు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. శుక్రవారం కూతురు ఆధార్‌కార్డు గురించి భార్య పుట్టింటికి వెళ్లింది. అదే రోజు ఇంట్లోనుంచి బయటికి వెళ్లిన గంగరాజు తిరిగి రాలేదు. దీంతో శనివారం కుటుంబ సభ్యులు లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం లింగంపేట ఊర చెరువు తూము వద్ద గంగరాజు చెప్పులు కనిపించాయి. దీంతో పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించి చెరువులో గాలించగా గంగరాజు మృతదేహం లభించింది. చనిపోవడానికి ముందు గంగరాజు తన చావుకు వాడే(లోన్ ఇప్పిస్తానన్న ఫోన్‌లో నమ్మించిన వ్యక్తి) కారణమని వాట్సాప్ గ్రూపులలో మెస్సేజీలు పంపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సోని, కూతురు నవ్యశ్రీ, తల్లిదండ్రులు అనసూయ, దర్శన్ ఉన్నారు.



రాణాకలాన్ జెడ్పీహెచ్‌ఎస్ 1985-86 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు



చిన్నమల్లారెడ్డిలో చైతన్య విద్యానికేతన్ హైస్కూల్ 2002-03 బ్యాచ్ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం



మైలారం జెడ్పీహెచ్‌ఎస్ 2007-08 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

ధర్పల్లి/ఎడపల్లి/కామారెడ్డి అర్బన్/నిజామాబాద్ అర్బన్: కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఆదివారం వివిధ పాఠశాలల పూర్వ విద్యార్థులు 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం' కార్యాక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు. ధర్పల్లి మండలంలోని మైలారం జెడ్పీహెచ్‌ఎస్‌లో 2007-08లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆ త్మీయ సమ్మేళనం నిర్వహించి, ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఆనాటి తీపిగుర్తులు, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆప్యాయతంగా పలకరించుకొని వారి జీవన స్థితిగతులు పంచుకొని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే ఎడపల్లి మండలం రాణాకాలన్ జెడ్పీహెచ్‌ఎస్‌లోనూ 1985-86 పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలోని చైతన్య విద్యానికేతన్ హైస్కూల్‌లో 2002-03 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నగరంలో దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2001-02 పదో తరగతి విద్యార్థులు, అలాగే రావూజీ వంజరి సంఘం ఉన్నత పాఠశాల 1995-96 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాలు వేర్వేరుగా నిర్వహించారు. రావూజీ వంజరి సంఘం విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్న వారందరికి భగవద్గీత గ్రంథాన్ని బహుమతిగా అందజేశారు.



దుబ్బ జెడ్పీహెచ్‌ఎస్ 2001-02 బ్యాచ్ విద్యార్థులు



నగరంలోని రావూజీ వంజరి సంఘం ఉన్నత పాఠశాల 1995-96 బ్యాచ్ విద్యార్థులు

పెయింటింగ్ చిత్రాల ద్వారా బోధన

- ఆదర్శంగా నిలుస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి
- సొంత డబ్బులతో ఏర్పాటు



క్లాస్ రూంలో చిత్రాల ద్వారా విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి

మాక్లూర్: విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా పాఠాలు బోధించటంలో మండలంలోని మదన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి ప్రత్యేకంగా నిలుస్తున్నారు. అలాగే సొంత డబ్బులతో పాఠశాలలో పెయింటింగ్ చిత్రాలను ఏర్పాటు చేసి, పాఠాలు చెబుతున్నారు. విద్యార్థులు సైతం వారి బోధన తీరుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఇట్టే పాఠ్యాంశాలను అవగతం చేసుకుంటున్నారు. ఈ విధానంతో పిల్లలు చదువులో ముందువరుసలో ఉండటంతో గ్రామస్తులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండ తనకు తోచినవిధంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ తన ఉదారాన్ని చాటుకుంటున్నారు. నారాయణరెడ్డి విద్యార్థుల పట్ల చూపుతున్న ప్రత్యేక శ్రద్ధపై గ్రామస్తులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

టీఈఏఎస్‌ఏ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం, నాయకులు

సుభాష్‌నగర్: హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క టీఈఏఎస్‌ఏ డైరీని ఆదివారం ఆవిష్కరించారు. టీఈఏఎస్‌ఏ ఆధ్వర్యంలో ప్రచురించిన డైరీ అందరికీ ఉపయోగపడే విధంగా ఉందని అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు నాగరాణి, కార్యదర్శి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా నాయకులు శ్రీనివాస్ గౌడ్, నితిన్, స్వామి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్..



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో

నిజామాబాద్ అర్బన్: నగరంలోని డీఈవో కార్యాలయంలో టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను డీఈవో అశోక్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెనిగల్ల సురేశ్, పుదారి అరవింద్, మల్లేశం, భారతి, ఇబ్రహీం, గంగ ప్రసాద్, లింబయ్య, గంగాధర్, పవన్, గోపి పాల్గొన్నారు.

జిల్లా సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్షలో రెండో స్థానం



పిట్లం(జుక్కల్): కామారెడ్డి జిల్లా స్థాయి పదవ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ పరీక్షల్లో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పిట్లం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి శ్రీకాంత్ రెడ్డి రెండో స్థానాన్ని సాధించి ఫోరం బాధ్యుల చేతుల మీదుగా మెమోంటో, మెరిట్ సర్టిఫికేట్ అందుకున్నారు. శ్రీకాంత్ రెడ్డిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రుద్రూర్: కోటగిరి మండలంలోని దేవునిగుట్ట తండా శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వివరాలు ఇలా.. కోటగిరి మండలంలోని నాగేంద్రపురం గ్రామానికి చెందిన గైని పవన్ (22)అనే యువకుడు పొలంలో మందు పిచికారి చేయడానికి ఉదయం ఇంటి నుంచి బైక్‌పై బయలు దేరాడు. దేవునిగుట్ట తండా శివారులో అతడు ఎదురుగా వస్తున్న కోళ్ల ఆటోను ఢీకొట్టాడు. ఈఘటనలో అతడు తీవ్రంగా గాయపడగా స్థానికులు గమనించి అంబులెన్స్‌లో బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ అస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి మైసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

రెంజల్(బోధన్): రెంజల్ శివారులో గల పీఏసీఎస్ గోదాం వెనుక భాగంలో పేకాడుతున్న ఐదుగురిని పట్టుకొని, అరెస్టు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడి చేసి వారిని పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే వారి నుంచి రూ.9400 నగదుతో పాటు పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.